

'కురుమూర్తి'కి మహర్దశ

కురుమూర్తిస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి.

వివరాలు 8లో ▶



నిరుద్యోగులు లేకుండా చేస్తాం

నిరుద్యోగులు ఉండరాదనే జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు 8లో ▶

గరిష్టం/కనిష్టం

37.4 /26.1

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- హాజరుకానున్న 6,608 మంది విద్యార్థులు

కందనూలు: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 12వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో మొదటి సంవత్సర జనరల్ విద్యార్థులు 3,511 మంది, ఒకేషనల్ విద్యార్థులు 522 మంది హాజరు కానున్నారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 2,282 మంది, ఒకేషనల్‌లో 313 మంది విద్యార్థులు.. మొత్తంగా 6,608 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా మొత్తం 19 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30నిమిషాల నుంచి 5.30నిమిషాల వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. నిమిషం నిబంధన అమలులో ఉంటుంది. ఇప్పటికే పరీక్షల నిర్వాహకులైన చీఫ్ సూపరింటెండెంట్స్, అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్, కస్టోడియన్లకు జిల్లా ఇంటర్ పరీక్ష నిర్వహణ కమిటీ కన్వీనర్ జి.వెంకటరమణ పరీక్షల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు అధికారి వెంకటరమణ తెలిపారు. విద్యార్థులు 30 నిమిషాల ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

విద్యా దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

కందనూలు: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రతి పాఠశాలలో ఈ నెల 20వ తేదీన విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు, అదేరోజు విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు పండుగ వాతావరణంలో అందజేయనున్నట్లు డీఈఓ గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేది సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు పునః ప్రారంభం చేయనున్నట్లు, 2023-24 విద్యా సంవత్సరంలో మొత్తం 229 రోజులు పనిచేస్తాయని పేర్కొన్నారు. జూన్ 3 నుండే ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం చేపట్టామని, జిల్లాలో 70 వేల మంది విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలను సైతం అందజేయనున్నట్లు తెలిపారు.

'చేనేతబంధు అమలు చేయాలి'

వనపర్తిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు తరహాలో చేనేతబంధు పథకాన్ని అమలుచేసి పద్మశాలి కులస్తులను ఆర్థికంగా ఆదుకోవాలని పద్మశాలి సంఘం చైర్మన్ రాలిరాల శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షుడు నీలి నారాయణ కోరారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఓ వస్త్ర దుకాణంలో పద్మశాలిని ఆదుకోవాలంటూ కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. వ్యవసాయం తర్వాత చేనేత రంగంపైనే ఆధారపడి చాలామంది ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. వెనుకబడిన పద్మశాలి, చేనేత కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని గుర్తుచేశారు. కరపత్రాలతో జిల్లాలోని పద్మశాలీలను చైతన్యం చేస్తూ గోసను ప్రభుత్వానికి చేరవేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకట్రాములు, వేణు, శేఖర్, పాండు, చిన్న కరుణాకర్, మాకం జాని, ఊశన్న తదితరులు పాల్గొన్నారు.

మోగనున్న బడిగంట



జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల



నేటి నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు

- పాఠ్యపుస్తకాల పంపిణీలో తొలగని సందిగ్ధత
- పునఃప్రారంభం రోజే అందరికీ పుస్తకాలు అందజేస్తామంటున్న అధికారులు
- కావాల్సింది 6.25లక్షలు.. జిల్లాకు చేరినవి 3.71లక్షలే..
- జిల్లాలోని 961 ప్రభుత్వ పాఠశాలల్లో 90వేలకుపైగా విద్యార్థులు

కందనూలు: వేసవి సెలవులు ముగియడంతో నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అయితే, విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయడంలో సందిగ్ధత నెలకొంది. ప్రారంభం రోజు నాటికే అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా జిల్లాలో ఇప్పటి వరకు బడులకు చేరలేదు. గతేడాది ఆలస్యంగా పంపిణీ కావడంతో నూతన ప్రవేశాలపై ప్రభావం పడడంతోపాటు బోధనకు ప్రతిబంధకాలుగా మారాయి.

ద్విభాష విధానంలో..

రెండేళ్ల కిందట ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను ఒకే మాధ్యమంలో ముద్రించే వారు. సర్కారు బడుల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమ బోధనను ప్రవేశపెట్టడంతో వారు పాఠాలను అర్థం చేసు కోవడం కష్టంగా మారింది. గతేడాది నుంచి ఒక వైపు తెలుగు, మరో వైపు ఆంగ్లంలో ముద్రించే పద్ధతిని అమలు చేస్తున్నారు. విద్యార్థులపై భారం పడకుండా ఒక్కో పాఠ్యపుస్తకాన్ని పార్ట్-1, పార్ట్-2గా ముద్రించారు. ఈ విధానాన్ని గతేడాది 3వ తరగతి నుంచి 8వ తరగతులకు ప్రవేశపెట్టారు. ఈ విద్యాసంవత్సరంలో 9వ తరగతికి కూడా ఇదే పద్ధతిని అమలు చేస్తున్నారు. కాగా జిల్లాలో 566 ప్రాథమిక, 128 ప్రాథమికోన్నత, 131 ఉన్నత పాఠశాలలతోపాటు 20 కస్తూర్బాగాంధీ, 2 ఆదర్శ, 11 మహాత్మాజ్యోతిబాపూలే గురుకులాలు, 14 సోషల్ వెల్ఫేర్, 3 ట్రైబల్, 3 మినీ గురుకులాలు, 4 మైనార్టీ గురుకుల పాఠశాలలు మొత్తంగా 961 పాఠశాలల్లో 90వేలకు పైగా విద్యార్థులు ఉన్నారు.

పాఠశాలల ముస్తాబు

నేటి నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు

వేసవి సెలవుల అనంతరం జిల్లావ్యాప్తంగా పాఠశాలలు సోమవారం పండుగ వాతావరణంలో ప్రారంభం కానున్నాయి. విద్యార్థులను ఆకర్షించడానికి ఇప్పటికే పాఠశాలలను మామిడి తోరణాలు, పూల దండలతో అందంగా ముస్తాబు చేశారు. ఈనెల 14వ తేదీ కొత్తగా పాఠశాలకు వచ్చే విద్యార్థుల కోసం ప్రతి పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నారు.

మిగిలిన పుస్తకాలు త్వరలో వస్తాయి..



పండుగ వాతావరణంలో పాఠశాలలను పునః ప్రారంభిస్తాం. విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రణాళిక బద్ధంగా ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్నాం. పాఠ్యపుస్తకాలను మండల కేంద్రాలకు పంపించాం. అందరు విద్యార్థులకు పుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాకు రావాల్సిన మిగిలిన పుస్తకాలు కూడా త్వరలోనే వస్తాయి.

– గోవిందరాజులు, డీఈఓ

పాఠ్యపుస్తకాలు సకాలంలో అందేనా..?

జిల్లాలోని ప్రభుత్వ, సంక్షేమ గురుకుల, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీల్లో విద్యార్థులకు పార్ట్ 1, పార్ట్ 2లకు కలిపి 6.25లక్షల పాఠ్యపుస్తకాలు అవసరమని జిల్లా విద్యాశాఖ ప్రభుత్వానికి నివేదిక పంపించింది. ఇప్పటి వరకు 3.70లక్షల పుస్తకాలు మాత్రమే జిల్లాకు చేరగా వాటిని సంబంధిత మండలాల ఎంఈఓలకు పంపిణీ చేశారు. మరో 2.4లక్షల పుస్తకాలు రావాల్సి ఉంది. ఆయా ఎంఈఓలు, హెచ్‌ఎంలు పుస్తకాలను పుస్తకాలను తీసుకెళ్లడం, వాటిని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు మరికొంత సమయం పట్టనుంది. ఇదిలాఉండగా, గతేడాది పుస్తకాల ముద్రణ ఆలస్యం కావడంతో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ ఏడాది త్వరితగతిన విద్యార్థులకు పంపిణీ చేస్తే కొత్తగా బడిబాటలో ప్రవేశాలు పొందిన బాలలతోపాటు, కొత్తగా చేరే విద్యార్థులకు కూడా ప్రయోజనంగా ఉండేది.

నేడు గద్వాలకు సీఎం కేసీఆర్ రాక



ముస్తాబైన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం

- నూతన సమీకృత కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవం
- జిల్లాకేంద్రంలో భారీ బహిరంగ సభకు ముమ్మర ఏర్పాట్లు
- పర్యవేక్షించిన మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యేలు

గద్వాల రూరల్: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సోమవారం గద్వాలకు రానున్నారు. జిల్లాకేంద్రంలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం తెలంగాణ చౌరస్తా సమీపంలో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి ఐదురోజులుగా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ సృజన పటిష్ట ఏర్పాట్లు చేస్తుండగా.. మరోవైపు పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం, భారీ బహిరంగ సభకు సంబంధించి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ సైతం జిల్లాలో పర్యటించి ఏర్పాట్లపై అధికారులకు, పార్టీ నాయకులు సలహాలు, సూచనలు చేశారు. జిల్లాలోని 12 మండలాల నుంచి బహిరంగ సభకు పెద్దఎత్తున ప్రజలను తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

పటిష్ట బందోబస్తు

సీఎం పర్యటన నేపథ్యంలో ఎక్కడా చిన్నపాటి అవాంతరం తలెత్తకుండా ఎస్పీ సృజన ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేక పోలీసు బలగాలను రంగంలోకి దింపారు. అదేవిధంగా డీఐజీ చౌహాన్ సీఎం ఏర్పాట్లపై సమీక్షించారు. సీఎం పర్యటించే ప్రాంతాలను ఇప్పటికే పోలీసులు ఆధీనంలోకి తీసుకుని పహారా కాస్తున్నారు.

కార్యాలయాల ముస్తాబు

నూతన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం, ఎస్పీ కార్యాలయాలను సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి కార్యాలయ నిర్మాణ పనున్నింటినీ శరవేగంగా పూర్తి చేయించారు. కలెక్టర్, ఎస్పీ ఇద్దరూ ఎప్పటికప్పుడు దగ్గరుండి పర్యవేక్షిస్తూ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా ప్రొటోకాల్ అమలు చేసేలా ఆహ్వానం, పూజలు వంటి క్రతువులను ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఇందుకు సంబంధించి వివిధ శాఖల అధికారులకు బాధ్యతలను అప్పగించారు.

జిల్లా కేంద్రం.. గులాబీయం

సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లాకేంద్రమైన గద్వాల పట్టణమంతా గులాబీమయంగా మారింది. ప్రధాన రహదారులు, కూడళ్ల, వార్డుల్లో ఫ్లెక్సీలు, వాల్‌పోసర్లు, జెండా తోరణాలు, గులాబీ జెండాలు రెపరెపలాడుతున్నాయి. పట్టణ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన భారీ కటౌట్లు అందరినీ ఆకట్టుకున్నాయి.

భారీ బహిరంగ సభ

ఎన్నికల సంవత్సరంలోకి అడుగుపెట్టడంతో సీఎం కేసీఆర్ ముందస్తుగానే పార్టీ నాయకులను సమాయత్తం చేశారు. నిరంతరం ప్రజల్లో ఉండేలా అవసరమైన కార్యక్రమాలను రూపొందించారు. ఇప్పటికే 21రోజులపాటు దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కిందిస్థాయి గ్రామ వార్డు మెంబర్ మొదలుకుని ఎమ్మెల్యే వరకు అందరు కూడా నిరంతరం ప్రజల మధ్య ఉండేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో ఈ నెల 2 నుంచి జిల్లాలో గ్రామ స్థాయి మొదలుకుని, మండల, జిల్లాస్థాయి వరకు తొమ్మిదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలను వివరిస్తున్నారు. ఈక్రమంలోనే సీఎం కేసీఆర్ గద్వాల పర్యాటనకు శ్రీకారం చుట్టారు. జిల్లా కేంద్రంలో నిర్మించిన నూతన సమీకృత కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అలాగే, 60- 70 వేల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించేలా పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు.

ఢిల్లీకి తరలిన నల్లమల చెంచులు



మన్ననూర్ ఐటీడీఏ నుంచి ఢిల్లీకి బయలుదేరిన చెంచులు

నేడు రాష్ట్రపతి భవన్‌లో ఆదివాసీలతో రాష్ట్రపతి ముఖాముఖి

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్రపతి ద్రౌపదిముర్మును నల్లమలకు చెందిన చెంచులు ఢిల్లీలో సోమవారం కలవనున్నారు. సోమవారం ఉదయం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే 'ఆదివాసులతో ముఖాముఖి' కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమల నుంచి 15 మంది చెంచులు పాల్గొననున్నారు. దేశంలోని ఆదిమ జాతులకు చెందిన తెగల జీవన పరిస్థితులను రాష్ట్రపతి స్వయంగా తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. దీని కోసం తెలంగాణతోపాటు ఏడు రాష్ట్రాల నుంచి సుమారు 1,600 వరకు ఆదివాసులు హాజరవనుండగా.. నల్లమలలోని అమ్రాబాద్, పదర, కొల్లాపూర్ మండలాల నుంచి 15 మంది చెంచులు ఆదివారం రైలులో ఢిల్లీకి బయలుదేరారు. రాష్ట్రం నుంచి చెంచులు, తోటి గిరిజన, కలాంగిరి, కొండరెడ్ల జాతికి చెందిన ఆదిమ తెగలు 15 మంది చొప్పున మొత్తం రాష్ట్రం నుంచి 60 మంది హాజరుకానున్నారు. వీరంతా రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి విందులో పాల్గొంటారు. చెంచులు, ఆదివాసుల ఢిల్లీ ప్రయాణానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. నల్లమలలోని అమ్రాబాద్ మండలానికి చెందిన చెంచులు పోతమ్మ, పుష్పవతి, అక్కమ్మ, లింగస్వామి, నాగన్న, దాసరి లింగస్వామి, శాంతి, భౌరమ్మ, నారాయణ, పద్మ తదితరులు సోమవారం రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును కలుసుకోనున్నారు.

నూతన కలెక్టరేట్‌లో 'ప్రజావాణి'

కందనూలు: ఇక నుంచి ప్రజావాణి జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో ఉన్న నూతన సమీకృత కలెక్టరేట్‌లో జరగనుందని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ (సోమవారం) ప్రజావాణి సైతం నూతన సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందింలో నిర్వహించనున్నట్లు, పాత కలెక్టర్ కార్యాలయాన్ని, ఇతర శాఖలను ఇక్కడికి మార్చామని, ఈ మార్పును ఫిర్యాదుదారులు, ప్రజలు గమనించాలని కోరారు.

నేడు 2కే తెలంగాణ రన్

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 12వ తేదీన సోమవారం ఉదయం 6గంటలకు జిల్లా కేంద్రంలో తెలంగాణ రన్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూలు పోలీస్‌స్టేషన్ పెరేడ్ గ్రౌండ్ నుంచి జరిగే 2కే తెలంగాణ రన్‌ను ప్రధానంగా కేసరి సముద్రం మినీ ట్యాంక్ బండ్ వరకు నిర్వహిస్తున్నామని, ఈ రన్‌లో యువత, కళాశాల విద్యార్థినీ,విద్యార్థులు, ఉద్యోగులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమాజాన్ని చైతన్యపర్చే శక్తి కవులకే ఉంది

- అడిషనల్ కలెక్టర్ మనూచౌదరి
- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సాహిత్య దినోత్సవం
- తెలంగాణ ఔన్నత్యాన్ని చాటి చెప్పిన కవి సమ్మేళనం



కవులను సన్మానిస్తున్న అడిషనల్ కలెక్టర్ మనూ చౌదరి

కందనూలు: ఎప్పుడైనా, ఏ సమయంలోనైనా సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి కవికి మాత్రమే ఉందని అడిషనల్ కలెక్టర్ మనూచౌదరి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా నూతన నూతన సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కవి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా నిర్వహించిన కవి సమ్మేళనం అలరింపజేసింది. ఈ కవి సమ్మేళనానికి అడిషనల్ కలెక్టర్ మనూ చౌదరి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి 10 వసంతాలు నిండుతున్నందున తెలంగాణ స్ఫూర్తిని, ఈనాటి అభివృద్ధిని కవుల ద్వారా తిరిగి వినడం అద్భుతంగా ఉందన్నారు. ఎంతోమంది కవులు పద్య, వచన కవితల ద్వారా తెలంగాణ పోరాటంలోనే కాకుండా, సమాజంలో జరిగే అన్యాయాలపై కూడా ప్రజలను ఉత్తేజితులను చేశారని, చేస్తున్నారని అన్నారు.

కవిత్వం, సాహిత్యం.. వ్యక్తిత్వానికి పునాది

కవిత్వం, సాహిత్యం వ్యక్తుల వ్యక్తిత్వానికి పునాదులని మరో అడిషనల్ కలెక్టర్ ఎస్ మోతీలాల్ అన్నారు. కవులు సమాజ హితం కోరి వారి కవితల ద్వారా తెలుగు భాషా ప్రాశస్త్యాన్ని సమాజంలో తల్లిదండ్రుల పట్ల పిల్లలు ప్రవర్తిస్తున్న తీరు, పిల్లల మానసిక అశాంతిని తొలగించేందుకు తీసుకోవాల్సిన చర్యలు వివరించి ఇంత ఘనంగా కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాంను అభినందించారు. కందనూలు జిల్లా కవులకు ప్రసిద్ధి అని, కవులు తమ కవితాగానంతో సమాజాన్ని ప్రభావితం చేస్తారని డీపీఆర్‌ఓ సీతారాం అన్నారు.

తరలివచ్చిన కవులు..

జిల్లా నలుమూలల నుంచి కవులు తరలివచ్చారు. తమ సందర్భోచిత కవితా వచనాలతో సమ్మేళనానికి వన్నెలద్దారు. ఒకరికొకరు దీటుగా దశాబ్ద తెలంగాణ ప్రగతిని ప్రతిబింబించేలా అక్షర విన్యాసాలు, పదబంధాలను ప్రయోగిస్తూ సాహితీ పిపాసుల మనసులను రంజింపజేశారు. అనంతరం కవులను సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు నర్సింగ్ రావు, కృష్ణ, నటరాజ్, కవులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లలో ప్రగతివంతమైన పాలన

- ఆయుష్మాన్ భారత్‌ను సీఎం కేసీఆర్ అడ్డుకున్నారు
- నాగర్‌కర్నూల్‌లో కేంద్రమంత్రి మహేంద్రనాథ్ పాండే



కృష్ణానది తీర ప్రాంతంలో పరిశీలిస్తున్న కేంద్రమంత్రి మహేంద్రనాథ్‌పాండే తదితరులు

సాక్షి, నాగర్‌కర్నూల్: గత పాలకులు ఏడు దశాబ్దాలుగా చేయలేని ఎన్నో పనులను తమ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో సాధించిందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే అన్నారు. పార్లమెంట్ ప్రవాస్ యోజనలో భాగంగా ఆయన రెండు రోజుల పాటు నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటనకు ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆయన మీడియాకు వివరించారు. అటల్ బిహరీ వాజ్‌పేయ్ స్ఫూర్తితో తమ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ప్రగతివంతమైన పాలన సాగించిందన్నారు. కేంద్రం ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షల వరకు పేదలకు అందిస్తున్న ఉచిత వైద్యాన్ని సీఎం కేసీఆర్ తన అహంకారంతో అడ్డుకుని తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రపంచ నాయకుడిగా అవతరించారని, ఇతర దేశాలన్నీ ఆయన పాలనను కీర్తిస్తున్నాయన్నారు. ఒక్క పైసా అవినీతి లేకుండా బడ్జెట్లో కేటాయించిన ప్రతిపైసాను పేదలకు పంచుతున్నామని చెప్పారు. తమ ప్రభుత్వ పాలనలో 2జీ స్పెక్ట్రం వంటి భారీ కుంభకోణాలు లేవన్నారు. దశాబ్దాలపాటు అధికారంలో ఉన్న గత పాలకుల కన్నా ఎన్నో అంశాలను తమ ప్రభుత్వం తొమ్మిదేళ్లలోనే సాధించిందని చెప్పారు. జిల్లాలోని కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు చేపట్టిన 167కె జాతీయ రహదారితోపాటు సోమశిల- సిద్ధేశ్వరం వద్ద దేశంలోనే అతిపెద్ద డ్యాం వంతెన నిర్మాణాన్ని కేవలం రెండేళ్లలోనే పూర్తిచేయనున్నట్లు వివరించారు. ఇక్కడి ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధిపరుస్తామని చెప్పారు. బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో 53,868 కి.మీ., జాతీయ రహదారులను నిర్మించామన్నారు. 15 ఎయిమ్స్ సంస్థలు, 700 మెడికల్ కళాశాలలు, కొత్తగా 69 వేల మెడికల్ సీట్లను పెంచామన్నారు.

అభివృద్ధిలో మా భాగస్వామ్యం..

కొల్లాపూర్: తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉంది.. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత బీజేపీ శ్రేణులదేనని కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే అన్నారు. ఆదివారం ఉదయం సోమశిలలోని లలితాంబికా సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సమీపంలోని కృష్ణానదిలో పడవలో ప్రయాణించారు. 167కే జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కృష్ణానదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. మల్లేశ్వరం శివారు నుంచి సంగమేశ్వరం వరకు బ్రిడ్జి నిర్మించబోయే ఏరియాను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, నేషనల్ హైవే డీఈ అశోక్‌రెడ్డి చూపించారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం కేంద్ర మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతాలు పర్యాటకంగా ఎంతో అభివృద్ధి సాధిస్తాయన్నారు. భారత్‌మాల పథకంలో భాగంగా నేషనల్ హైవే, బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ రహదారి, బ్రిడ్జి నిర్మాణ సాధనకు సుధాకర్‌రావు, ఆచారి ఎంతో కృషిచేశారని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీకి అధికారం ఇస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, అనువైన స్థలాలుంటే పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమే అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో బీజేపీ గతం కంటే ఈసారి మెరుగ్గా ఉందని, పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగుతామని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, నాయకులు రాజవర్ధన్, సుబ్బారెడ్డి, దిలీప్‌చారి, శేఖర్‌గౌడ్, రోజారమణి, కృష్ణ, బుడ్డన్న, నారాయణ, సాయికృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్ విడుదల చేస్తున్న కేంద్రమంత్రి మహేంద్రనాథ్‌పాండే తదితరులు

గ్రూప్ -1 పరీక్ష ప్రశాంతం



జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రం వద్ద పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ మనోహర్

జిల్లాలో 68.93శాతం హాజరు

కందనూలు: జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా.. 68.93శాతం అభ్యర్థులు హాజరయ్యారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తిలో పరీక్ష కేంద్రాల్లో 5,130 అభ్యర్థులకుగాను 3,536 మంది అభ్యర్థులు హాజరు కాగా, 1594 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా పరీక్ష సరళిని కలెక్టర్ ఉదయ్‌కుమార్ వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఎస్పీ మనోహర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని తనిఖీ చేసి, పోలీసులకు బందోబస్తుపై పలు సూచనలు చేశారు. అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ జిల్లా కేంద్రంలో పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

‘కురుమూర్తి’కి మహర్దశ

- ఆలయం వద్ద అభివృద్ధి పనులు
- దాతల సహకారంతో పురోభివృద్ధి
- శరవేగంగా సాగుతున్న నిర్మాణాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న భక్తులు

చిన్నచింతకుంట: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పేదల తిరుపతిగా పేరుగాంచిన మండలంలోని అమ్మాపురంలో వెలసిన కురుమూర్తిస్వామి ఆలయానికి మహర్దశ చేకూరుతోంది. ప్రతినెలా అమావాస్య, శని, సోమవారాలతోపాటు ప్రతిఏటా జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి దర్శనానికి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. దీంతో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు కొందరు ఆలయ అభివృద్ధికి తమవంతుగా సహకారం అందిస్తున్నారు. వీటికి తోడు ప్రభుత్వం పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు శ్రీకారం చుడుతుంది.

ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావంతో..

కురుమూర్తిస్వామి ఆలయం అమ్మాపురం సంస్థానాధీశులైన ముక్కెర వంశస్థుల ఆధీనంలో ఉండేది. 1983లో దేవాదాయ శాఖలో విలీనం చేశారు. అయితే మొదట్లో ప్రభుత్వాలు ఆలయ అభివృద్ధిపై అంతగా దృష్టి సారించలేకపోయాయి. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక అభివృద్ధికి నిధులు కేటాయిస్తుంది. ప్రస్తుతం ఆలయం వద్ద సీజీఎఫ్ ద్వారా రూ.50 లక్షలు, ఆలయం నుంచి రూ.70 లక్షలు వెచ్చించి రాజగోపురం నిర్మించారు. ఆలయ సమీపంలోని ఊకచెట్టువాగు పైనుంచి రూ.41 కోట్లతో కాజువే నిర్మాణంతోపాటు స్వామివారి ప్రధాన ఆలయం వరకు ఘాట్ రోడ్డు నిర్మించనున్నారు.

దాతల సహకారంతో..

2005 సంవత్సరం నుంచి ఆలయానికి పలువురు దాతలు చేయూతనందిస్తున్నారు. ఇప్పటి వరకు వారి సహకారంతోనే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. ఆలయ మొదటి మెట్ల కమాన్ నుంచి స్వామివారి ప్రధాన ఆలయం వరకు మెట్ల విస్తరణ, మెట్లపై రేకుల షెడ్డు ఏర్పాటు, కోనేరు పునర్నిర్మాణం, 11 విడిది సత్రాలు, అన్నదాన సత్రం, స్వామివారి సన్నిధిలో యాగశాల మండపం, మంచినీటి ట్యాంక్, అలివేలు మంగమ్మ ఆలయం నుంచి దిగుడు మెట్ల ఏర్పాటు, ఉత్తర భాగాన మట్టి రోడ్డు, గోశాల నిర్మాణంతోపాటు కొత్తగా అతిథి గృహ నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రతిఏటా ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను చూసి స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


కురుమూర్తి స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దిగుడు మెట్లు


కురుమూర్తి స్వామి ఆలయం వద్ద పునర్నిర్మాణం చేపట్టిన కోనేరు


స్వామివారి ప్రధాన ఆలయం వరకు ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు

సంతోషంగా ఉంది..

కురుమూర్తిస్వామి ఆలయ ప్రాగణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు దాతలు ముందుకు రావడం సంతోషంగా ఉంది. దాతల సహకారంతోనే కోనేరు పునర్నిర్మాణం, అలివేలు మంగమ్మ ఆలయం నుంచి దిగుడు మెట్లు, తూర్పు భాగాన స్వామివారి ఆలయం వరకు మట్టి రోడ్డు, గోశాల వంటి పనులు చేపట్టడం జరిగింది. – ప్రతాప్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

దాతలు ముందుకు రావాలి..

కురుమూర్తిస్వామి ఆలయంలో దాతల సహకారంతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇంకా ఆలయ అభివృద్ధిలో పాలు పంచుకోవాలనుకున్న దాతలు ఉంటే ముందుకు రావాలి. ప్రభుత్వం నుంచి కూడా నిధులు వస్తుండటంతో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నాం.
– మదనేశ్వర్‌రెడ్డి, ఆలయ ఈఓ

ఇబ్బందులు లేవు..


కురుమూర్తిస్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం ఏదో ఒక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. గతంలో స్వామివారి ప్రధాన ఆలయం మెట్లు చిన్నగా ఉండేవి. దీంతో దర్శనానికి వచ్చినప్పుడు భక్తుల రద్దీతో ఇబ్బందులు ఎదురయ్యేవి. అలాగే కోనేరు సైతం శిథిలావస్థకు చేరడంతో స్నానాలు ఆచరించేందుకు అనువుగా ఉండేది కాదు. వాటి పునర్నిర్మాణం చేపట్టడంతో ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేవు.
– విమలన్న, భక్తుడు, మద్దూరు

అభివృద్ధిలో సహకారం


కురుమూర్తిస్వామి ఆలయ అభివృద్ధిలో మావంతు సహకారం ఉండాలన్న ఉద్దేశంతో నాకు తోచినంత ఆర్థిక సహాయం అందించాను. స్వామివారి ఆలయ అభివృద్ధిలో సహకారానికి అవకాశం దొరికినందుకు ఎంతో సంతోషంగా ఉంది. భవిష్యత్‌లోనూ సహకారం కొనసాగిస్తాను.
– చెన్నయ్య, దాత, హైదరాబాద్

పనులు కొనసాగుతున్నాయి..


కురుమూర్తిస్వామి సన్నిధిలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్వామివారి ఆలయం వరకు ఘాట్ రోడ్డు, రాజగోపురం పనులతోపాటు హైమాక్స్ లైట్ల ఏర్పాటు, పార్కు వంటి పనులు చేపట్టాం. దీనికి తోడు దాతలు కూడా సహకరిస్తుండటంతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది.
– నాగరాజు, ఆలయ డైరెక్టర్

క్లుప్తంగా

పాముకాటుకు గురై యువకుడు మృతి


రమేష్(ఫైల్)

ఖిల్లాఘనపురం: బొడ్రాయి పండుగకు వెళ్లి పాముకాటుకు గురై యువకుడు మృతి చెందిన సంఘటన భూత్పూర్ మండలం వెల్కిచెర్లలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఖిల్లాఘనపురం మండలంలోని కమాలోద్దీన్‌పూర్ చెందిన రమేష్(28) ఇసుక రీచ్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం కుటుంబ సభ్యులతో కలిసి బొడ్రాయి పండుగ కోసం భూత్పూర్ మండలం వెల్కిచెర్లలో చిన్నమ్మ ఇంటికి ఉదయం వెళ్లారు. రాత్రి అందరూ భోజనాలు చేసి ఆరుబయట పడుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున వీపు బాగాన ఏదో కరిచినట్లు అనిపిస్తే అనిపించడంతో రమేష్ లేచి చూసుకున్నాడు. రక్తం కనిపించడంతో సెల్ టార్చ్ వేసి చూశాడు. అక్కడే కట్ల పాము కనిపించడంతో అరిచాడు. అందరు నిద్రలేచి పామును చంపారు. చికిత్స నిమిత్తం రమేష్‌ను మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ధరూరు: మండలంలోని ఉప్పేరులో మృతదేహం శవం లభ్యమైంది. గ్రామానికి సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పశువుల కాపరులగా కనిపించగా పోలీసులకు సమాచారం అందించారు. 45 ఏళ్ల వయసున్న వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. సాయంత్రం 5 గంటల నుంచి వర్షం కురుస్తుండడంతో మృతదేహాన్ని తరలించేందుకు ఇబ్బందులు పడ్డారు. కుళ్లిపోవడంతో ముఖం గుర్తు పట్టడానికి వీలు లేకుండా పోయిందని గ్రామస్తులు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఉప్పునుంతల: మండలంలోని ఉప్పరిపల్లి సమీపంలోని వ్యవసాయ పొలంలో కొంత మంది పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఐదుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 1,900 నగదు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కేంద్రంలో బీసీ కులగణన చేపట్టాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కేంద్రంలో బీసీ కుల గణన చేపట్టాలని తెలంగాణ బలహీన వర్గాల సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు మధువాణి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. బీసీ కులాలకు బీసీబంధును అమలు చేసి ప్రతి యూనిట్‌కు రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. బీసీ కుల వృత్తులకు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు పెంచాలన్నారు. జనాభా ప్రాతిపదికను బీసీలకు 55శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. చట్ట సభలలో 55 సీట్లు ఇవ్వాలన్నారు. ఉమ్మడి జిల్లాలో రాజకీయ పార్టీలు మహిళలకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సంధ్య, లక్ష్మి, శోభ, మధులత, దీపిక, ఉమాదేవి, రాధమ్మ, విజయ పాల్గొన్నారు.

జోగుళాంబ సన్నిధిలో ప్రముఖులు

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను ఆదివారం ఉదయం ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, అర్చకులు ఆనంద్ శర్మ పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా కర్నూలు డీఐజీ గోపినాథ్ జెట్టి కుటుంబ సమేతంగా ఆలయాలను దర్శించుకున్నారు. కాగా వీరు బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు, జోగుళాంబ అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ, ప్రసాదాలు అందజేయగా.. ఈఓ శేషవస్త్రాలతో పాటు అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.



చెక్‌పోస్టులో మద్యం లొల్లి?

- సీసాలు పంచుకోవడంలో ఎక్సైజ్ పోలీసుల మధ్య వివాదం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

కృష్ణా: ఎక్సైజ్ చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మధ్య పట్టుబడిన మద్యం విషయంలో చెలరేగిన వివాదం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గుడెబల్లూరు పంచాయతీ పరిధిలోని రాష్ట్ర సరిహద్దులో అక్రమంగా రాష్ట్రంలో మద్యం తరలించకుండా ఎక్సైజ్ చెక్‌పోస్టును ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు. కాగా ఇక్కడే సిబ్బంది అక్రమాలకు తెరలేపారు. నిత్యం అక్రమంగా తరలిస్తున్నా మద్యం పట్టుబడుతుండడంతో అందులో కొంత వారు దాచుకోవడం, ఇతరులకు విక్రయించడం కొనసాగిస్తున్నారు. ఈ విషయం బహిరంగంగా తెలిసినా కూడా ఎవరూ ఇప్పటి వరకు పట్టించుకోలేదు. వారం రోజుల క్రితం గోవా నుంచి కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యం పెద్ద ఎత్తున పట్టుబడింది. అందులో కొంత విధుల్లో ఉన్న సిబ్బంది తీసుకున్నారు. కొంత మాత్రమే రికార్డులో నమోదు చేసి, మిగితాది అక్కడ విధుల్లో ఉన్న వారు పంచుకున్నారు. పంచుకున్న మద్యం కూడా ఓ అధికారి ఒక్కరే తీసుకెళ్లడంతో సిబ్బంది కాస్తా విషయాన్ని బహిరంగ పరిచారు. రాత్రి, పగలు విధుల్లో ఉండి మేము మద్యాన్ని పట్టుకుంటే మా అధికారి మాత్రం మొత్తం మద్యాన్ని మాకు తెలియకుండగా తీసుకెళ్తున్నాడని చెప్పుకున్నారు. పట్టుబడిన మద్యం రికార్డులో చూయించకుండగా, కొన్ని మార్లు కేసులు పెట్టకుండ నిందితులను విడిచిపెట్టినట్లు కూడా సమాచారం. ఈ విషయంపై ఆదివారం ఎక్సైజ్ సీఐ నాగేందర్‌గౌడ్‌ను వివరణ కోరగా.. ఈ వివాదం తనకు తెలియదని, విచారణ చేస్తామని తెలిపారు. ఏది ఏమైనా ఎక్సైజ్ చెక్‌పోస్టులో అవినీతి విషయంలో అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కర్ణాటక సరిహద్దులో ఎక్సైజ్ చెక్‌పోస్టు

‘పాలమూరు- రంగారెడ్డి’పై ప్రభుత్వ నిర్లక్ష్యం

భూత్పూర్: పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని పాలమూరు పునర్నిర్మాణ ఫోరం అధ్యక్షుడు, టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి ఆరోపించారు. ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి ఆదివారానికి 8 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాలమూరు పునర్నిర్మాణ ఫోరం, భూత్పూర్ మండల కాంగ్రెస్ నాయకులు కర్వేన రిజర్వాయర్‌ను సందర్శించడానికి వెళ్తుండగా మండల కేంద్రంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రెండున్నరేళ్లలో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తిచేస్తామన్న సీఎం కేసీఆర్ ఇక్కడి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. పాలమూరు ప్రాజెక్టు కంటే 11 నెలల తర్వాత శంకుస్థాపన చేసిన కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి నాలుగేళ్లవుతుందని, ఎనిమిదేళ్లు పూర్తయినా పాలమూరు పనులు 40 శాతం కూడా పూర్తికాలేదన్నారు. ఆగస్టు వరకు నీళ్లు ఇస్తామంటున్నారని, అసలు ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ పూర్తి కాలేదని, నీళ్లు ఎలా ఇస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాకు వచ్చిన ప్రతిసారి సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఈ నెలలో, వచ్చే నెలలో లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని అబద్ధాలు చెబుతున్నారని దుయ్యబట్టారు. పాలమూరు జిల్లా ప్రజలు కేసీఆర్, కేటీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు చెబుతున్న అబద్ధాలను గ్రహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, అశోక్‌రెడ్డి, భిక్షపతి, నరేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఇస్మాయిల్, నారాయణగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోలీసులతో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

విషాదం నింపిన పిడుగుపాటు

- 35 మేకలు, వ్యక్తి మృతి
- స్పృహ తప్పిపడిపోయిన తల్లీ, కూతురు


బాల్‌రాజ్ (ఫైల్)


పిడుగుపాటుకు గురై మృతిచెందిన మేకలు

గండేడ్: కుటుంబానికి జీవనాధారమైన మేకలను తీసుకుని మేతకు వెళ్లిన ఓ వ్యక్తితో పాటు మేకలు పిడుగుపాటుకు గురై మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దవార్వాల్ చెందిన కటికె బాల్‌రాజ్ (50)జీవనోపాధి కోసం మేకలను పెంచుకుంటున్నాడు. రోజుమాదిరి ఆదివారం మేకలను తీసుకుని పొలాల వైపు వెళ్లాడు. సాయంత్రం ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి పశువుల కొట్టంపై పిడుగు పడి బాలరాజు అక్కడే మృతి చెందగా, మేపేందుకు తీసుకెళ్లిన 40 మేకల్లో 30 మేకలు, జోగు బాలయ్యకు చెందిన 5మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి. ఆయనతోబాటు ఉన్న భార్య జమునాబాయి, చిన్న కూతురు స్పృహతప్పి పడిపోయారు. కొద్ది సేపటి తర్వాత తేరుకుని చూడగా మేకలు, భర్త విగతజీవులుగా పడి ఉన్నారు. పెద్దవార్వల్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి నలుగురు కూతుర్లు, కుమారుడు ఉండగా ఎవరికీ వివాహాలు కాలేదు. కుటుంబ ఆధారం, పెద్దదిక్కును కోల్పోయిన వారిని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని గ్రామస్తులు, బంధువులు కోరారు.

ఈ ప్రాంతంలోనే ఎక్కువ పిడుగుల వర్షం

పెద్దవార్వాల్, రుసుంపల్లి, జక్లపల్లి, వెన్నాచేడ్ ప్రాంతాల్లోనే ఎక్కువ పిడుగుల వర్షాలు కురుస్తున్నట్లు రైతులు తెలుపుతున్నారు. 15 రోజుల్లోనే రుసుంపల్లిలో రెండు కాడెద్దులు, జక్లపల్లిలో రెండు కాడెద్దులు, సాలార్‌నగర్‌లో 7మేకలు, పెద్దవార్వాల్‌లో మేక చనిపోయాయి. ఆదివారం కురిసిన వర్షానికి వ్యక్తి 35మేకలు చనిపోయాయి. ఈ ప్రాంతంలోనే ఎక్కువగా పిడుగుల వర్షం కురుస్తుండటంతో పశువుల కాపరులు రైతులు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు.

చెన్నంపల్లిలో అడవి జంతువు మాంసం పట్టివేత

లింగాల: మండలంలోని చెన్నంపల్లిలో శనివారం అర్ధరాత్రి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కొంతమంది ఇళ్లలో అడవి జంతువు మాంసం ఉందని సమాచారం అందుకున్న అటవీ శాఖ, లింగాల, బల్మూర్ పోలీసులు సంయుక్తంగా సోదాలు జరిపారు. ఈ క్రమంలో గ్రామస్తులు ప్రతిఘటించడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. గుర్తుతెలియని వ్యక్తులు టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోదాలు జరిపినట్లు డీఆర్‌ఓ జయదేవ్ తెలిపారు. ఓ వ్యక్తి ఇంట్లో వండిన మాంసం కిలో మేరకు లభ్యమైనట్లు ఆయన తెలిపారు. వండిన మాంసం ఏ జంతువుది అనేది నిర్ధారణ కోసం ల్యాబ్‌కు పంపుతున్నట్లు వివరించారు. సర్పంచ్ ఇంట్లో సైతం సోదాలు జరపగా ఎలాంటి మాంసం దొరకలేదని, ల్యాబ్ రిపోర్టు ఆధారంగా కేసులు నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

నిరుద్యోగులు లేకుండా చేయడమే లక్ష్యం


ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

అయిజ: అలంపూర్ నియోజకవర్గంలో ఏఒక్కరు కూడా నిరుద్యోగులుగా ఉండరాదనే ఉద్దేశంతో జాబ్ మేళాలను నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో స్వేరోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాబ్ ఆఫర్ లెటర్‌లను నిరుద్యోగులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు 50 కంపెనీల నుంచి హెచ్‌ఆర్‌లు వచ్చారని, 150 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించినట్లు తెలిపారు. రెండు నెలల క్రితం అలంపూర్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో 280 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో దేశంలో ఎక్కడ ఉద్యోగ అవకాశాలు ఉంటే అక్కడ అలంపూర్ నియోజకవర్గంలోని నిరుద్యోగులకు అవకాశం కల్పిస్తామన్నారు. అనంతరం మండలంలోని ఉత్తనూరు, భూంపురం, మూగోనిపల్లి బహుజన రాజ్యాధికార యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో పాలించిన కాంగ్రెస్, బీజేపీలు, ఇప్పుడు పాలిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ వెనుకబడిన వర్గాలకు సరైన న్యాయం చేయలేదన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించాలని కోరారు.

గద్వాలలో గాలి దుమారం

- దెబ్బతిన్న హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు
- బురదమయంగా మారిన బహిరంగ సభా స్థలం
- సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- బందోబస్తుపై దిశానిర్దేశం చేసిన ఎస్పీ సృజన

గద్వాల క్రైం: జిల్లాకేంద్రంలో ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో పెద్దఎత్తున గాలిదుమారం లేచింది. ఈ క్రమంలో సీఎం ఫొటోలతో ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు నెలకొరిగాయి. మరికొన్ని పూర్తిగా దెబ్బతిన్నాయి. సభాస్థలంలో చిరుజల్లులతో కూడిన వర్షానికి సభాప్రాంగణమంతా బురదమయంగా మారింది. అంతకు ముందు సభా ఏర్పాట్లను రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పరిశీలించారు.

➡ జిల్లాకేంద్రంలో సోమవారం సీఎం పర్యటనలో భాగంగా సిబ్బంది శాంతియుత వాతవారణంలో విధులు నిర్వహించాలని ఎస్పీ సృజన సూచించారు. ఆదివారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీఎం బందోబస్తుకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీస్ సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న సీఎం కేసీఆర్ పర్యటనలో ఎలాంటి అపశ్రుతి చోటుచేసుకుండా ప్రజలకు శాంతియుత వాతవారణం కల్పించాలన్నారు. సభకు వచ్చే కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులకు పలు రోడ్డు మార్గాల్లోని రూట్ మ్యాప్‌ల ద్వారా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. అయిజ– గద్వాల రోడ్డు మార్గంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. 2 వేల మంది సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు.

నేడు ట్రాఫిక్ ఆంక్షలు

సీఎం సభకు వచ్చే ప్రతి ఒక్కరిని దృష్టిలో ఉంచుకుని సోమవారం జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అయిజ, మల్దకల్ నుంచి వచ్చేవారు ఔటర్ రింగ్ రోడ్డు వద్ద కుడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలపాలన్నారు. ధరూర్ నుంచి వచ్చేవారు నోబుల్ స్కూల్ నుంచి అయిజ రోడ్డు మార్గంలోని దర్గా సమీపంలో పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలిపివేయాలన్నారు. ఎర్రవల్లి నుంచి వచ్చేవారు జమ్మిచేడ్ రోడ్డు మార్గం నుంచి పిల్లిగుండ్ల కాలనీ సమీపంలోని పార్కింగ్ వద్ద వాహనాలు నిలపాలని చెప్పారు. జిల్లాకేంద్రంలో సాయంత్రం నుంచి పలు మార్గాల్లో దారి మళ్లింపు చేపట్టినట్లు వివరించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా ఎస్పీలు, ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ సృజన


గాలి దుమారంతో చిరిగిపోయిన ఫ్లెక్సీలు